క్లుప్తంగా...

సీబీఐటీలో ముగిసిన సదస్సు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సస్టైనబిలిటీ, ఎనర్జీ ప్రాక్టీషనర్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ క్లీన్ ఎనర్జీపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా టీఎస్ఆర్ఈడీసీఓ వైస్ చైర్మెన్, ఎండీ ఎన్. జానయ్య పాల్గొన్నారు. ఆధునిక సోలార్ పీవీ మాడ్యూల్, సాంకేతికతల, సోలార్ ఎనర్జీలో సవాళ్లు అవకాశాలపై చర్చించారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అధికారి, సహాయ డైరెక్టర్ కె.శివరామ ప్రసాద్, ఎస్ఈపీఏ ఉపాధ్యక్షుడు కిషోర్ భువరాఘ పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



శంషాబాద్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నూతన కమిటీని గురువారం ఆలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌత వివేకానంద గుప్తా, ప్రధాన కార్యదర్శిగా చింతల నందకిశోర్ గుప్తా, కోశాధికారిగా చింతల రామకృష్ణ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మాద్గుల పందరినాథ్ గుప్తా, రవీందర్ గుప్తా, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.

ప్రేమావతిపేటలో కార్పొరేటర్ పర్యటన



రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రతి సమస్యను తెలుసుకోని శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ప్రేమావతిపేటలో అభివృద్ధి పనులలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులపై ఆయన గురువారం పర్యటించారు. ప్రతి రోజు ప్రతి కాలనీ, బస్తీలలో పర్యటిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారాలుచూపించడం జరుగుతుందని తెలిపారు. సురేష్‌ముదిరాజ్, రఘుముదిరాజ్, భవాని దాస్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన కెనడా బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని కెనడా దేశంలోని అంటారియాకి చెందిన వెస్ట్రన్ యూనివర్శిటీ ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. వెస్టన్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ అలాన్‌షెపర్డ్, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ కెన్నెత్ ఎస్ కోలీ, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లిల్లీచో, శాస్త్రి ఇండో-కెనడియన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐసీఐ) ద్వారా ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా మొదట ఈ బృందం హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, ఇతర హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, విద్యావేత్తలతో విద్యా సంబంధ అంశాలపై చర్చించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో సహకార అవకాశాలను, కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాలను అన్వేషించడం ఈ ప్రతినిధి బృందం పర్యటన లక్ష్యం.

సమన్వయంతో సమస్యల సత్వర పరిష్కారం

గచ్చిబౌలి: వివిధ విభాగాల అధికారుల సమన్వయంతోనే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలవుతుందని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు పోలీసులకు సహకరించాలని జడ్సీ కోరారు. ఏఐజీ హాస్పిటల్, క్యూమార్ట్ నుంచి గచ్చిబౌలి రోడ్డు, మీనాక్షి జంక్షన్ నుంచి ఐకియా వెళ్లే రోడ్డు, ఇజ్జత్‌నగర్ కల్వర్ట్‌ను విస్తరించాలని అధికారులను ఆదేశించారు. గౌలిదొడ్డి, కల్వరి టెంపుల్ డార్క్ స్పాట్స్, వాటర్ లాగింగ్ పాయింట్లు, పర్వత్ జంక్షన్‌లో విద్యుత్ స్తంభాలను మార్చాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు ట్రాఫిక్ అంతరాయంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్, హెచ్ఆర్‌డీసీఎల్, మెట్రో రైల్, నేషనల్ హైవే, టీఎస్ఐఐసీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు చేయాలి: జడ్సీ

వచ్చే ఎన్నికల ఏర్పాట్లకు సంబంధిత అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని వెస్ట్ జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి నియోజకవర్గం-052 రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సెక్టర్ ఆఫీసర్స్‌తో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి సెక్టర్‌లో 15 పోలింగ్ బూత్‌లు ఉంటాయని, రూట్‌మ్యాప్‌తయారు చేసుకోవాలని సూచించారు. తమకు కెటాయించిన పోలింగ్ స్టేషన్లను సందర్శించి అక్కడి సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. 49 మంది ఆఫీసర్లు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌తో 351 కుటుంబాలను కలిపిన ఏఎస్సై



ఏఎస్సై ఆసినా

రాజేంద్రనగర్: ఒకటి కాదు... రెండు కాదు... 351 కుటుంబాలను ఆ మహిళ ఏఎస్సై కలిపారు. విడిపోయేందుకు సిద్ధంగా ఉన్నా తన కౌన్సిలింగ్ ద్వారా వారిని ఏకం చేసింది. విడిపోయి వేరు వేరుగా ఉంటున్న ప్రత్యేక చొరవతో వారికి పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబాన్ని తీర్చిదిద్దింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా ఆసినా విధులు నిర్వహిస్తున్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఆసినా కుటుంబ కలహాలతో స్టేషన్‌కు వస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇస్తూ తన విధులు నిర్వహిస్తున్నారు. బుధవారానికి ఆసినా 351 మంది కుటుంబాలను తన కౌన్సిలింగ్ ద్వారా కలిపి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా సాక్షితో గురువారం పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలలో తనవద్దకు ఎందరో కుటుంబ కలహాలు, ఇతర కారణాలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులు, కోర్టుల వరకు వెళ్లారన్నారు. వారందరిని తాను ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో కౌన్సిలింగ్ ఇచ్చి కలిపినట్లు తెలిపింది. లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలిని చూడకుండా రోడ్డుపై వదిలివేసినట్లు ఫిర్యాదు అందడంతో తాను స్వయంగా అక్కడికి వెళ్లి ఆమె ఐదుగురు కుమారులను స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చానన్నారు. అనంతరం తల్లిని కుమారులు తీసుకువెళ్లి అపురూపంగా చూస్తున్నారన్నారు. మరోకేసులో భర్తకు పక్షవాతం రావడంతో భార్య ఇద్దరు పిల్లలను విడిచి వెళ్లిపోయిందని ఆమెను స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి ఆ కాపురాన్ని ఇద్దరు పిల్లల జీవితాన్ని నిలిపిన సంతోషం మిగిలిందని వెల్లడించింది. తాను చోరవ చూపి పక్షవాతానికి గురైన వ్యక్తికి సరైన మందులు అందించానని ప్రస్తుతం ఆ వ్యక్తి టెలీకాలర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలిపింది.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

బండ్లగూడ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ శ్రీలతసురేష్‌గౌడ్ వెల్లడించారు. గురువారం ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వరకు 30 ఫీట్ల బీటీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటర్ పైపులైన్‌లు ఎక్కడ డ్యామేజ్ కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, నరేంద పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు 20 సీట్లు కేటాయించాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంషాబాద్: ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు 20 సీట్లు కేటాయించాలని ముదిరాజ్‌సంఘం నేతలు డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల ఓట్లు కావల్సిన పార్టీలు సీట్లు మాత్రం కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం తీవ్ర అన్యాయమని గురువారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మెరుగు సురేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. 50 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్కసీటు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ కూడా పునరాలోచన చేసి ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యాటకారి సిద్దేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన చంద్రశేఖర్



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

రాజేంద్రనగర్: మద్యం మత్తులో కారును వేగంగా నడిపి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకోట్టారు. అనంతరం కారు రోడ్డుపై పల్టీలు కొట్టడంతో అందులోని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీఎన్‌జీవోస్ కాలనీకి చెందిన చంద్రశేఖర్(24)డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన శివం(24), వికాస్(25) స్నేహితులు. వికాస్ ట్యాక్సీ డ్రైవర్. బుధవారం రాత్రి చంద్రశేఖర్, శివం, వికాస్‌ల శంషాబాద్‌కు వెళ్లి అక్కడే మద్యం తాగి రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటికి బయలుదేరారు. కాటేదాన్ వచ్చిన అనంతరం పాన్‌షాప్ కోసం వెతికారు. అర్ధరాత్రి వేళ దుకాణాలు బంద్ ఉండడంతో దుర్గానగర్ వైపు వచ్చారు. ఈ సమయంలో చంద్రశేఖర్ కారును నడుపుతున్నారు. కారు వేగంగా వస్తు అదుపు తప్పి దుర్గానగర్ చౌరస్తా వద్ద డివైడర్‌ను ఢీకోట్టింది. అనంతరం పల్టీలు కోట్టి రోడ్డు పక్కన పడింది. ఈ సంఘటనలో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా శివం, వికాస్‌లు గాయపడ్డారు. వాహనాదారులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ ఇద్దరు యువకులను ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మద్యం మత్తులో వాహనం నడపడం ద్వారానే ఈ సంఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. వాహనం పల్టీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది.

సురక్షిత ట్రాఫిక్ జోన్ సాధనలో వలంటీర్ల పాత్ర భేష్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ ట్రాఫిక్ హర్షవర్ధన్

సైబరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ హర్షవర్ధన్

రాయదుర్గం: సురక్షితమైన ట్రాఫిక్ జోన్‌గా సైబరాబాద్‌ను రూపొందించడంలో వలంటీర్ల పాత్ర అమోఘమని సైబరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ హర్షవర్ధన్ పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో డిలాయిట్ సంస్థలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులకు రోడ్డు సంకేతాలు, రాంగ్ రూట్ డ్రైవింగ్, లేన్ క్రమశిక్షణ, మోటార్ వెహికిల్ డ్రైవింగ్ రెగ్యులేషన్ చట్టాలు, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన మొదలైన వాటిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇదిలావుండగా హర్షవర్ధన్ ఐపీఎస్‌లో చేరడానికి ముందు డెలాయిట్‌లో పూర్వ ఉద్యోగి కావడంతో ఆయన డెలాయిట్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రమాదాలకు దారితీసే రియల్ టైమ్ ట్రాఫిక్ దృశ్యాలు, అజాగ్రత్త, అలసత్వ ప్రవర్తన ప్రాణాంతక సంఘటనలకు ఎలా దారితీస్తాయో విశ్లేషించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ ట్రాఫిక్ రణ్వీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ టీమ్ లలితా టీమ్స్, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి కేశవ్ భండారి, పలువురు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత కోసం 'యూస్టా' ప్రారంభం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని శరత్‌సిటీ మాల్‌లో దేశంలోనే అతిపెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ యువత కోసం ప్రత్యేకించిన ఫ్యాషన్ రిటైల్ ఫార్మాట్ 'యూస్టా'ను గురువారం ప్రారంభించారు. సమకాలీన సాంకేతిక ఆధారిత స్టోర్ లేఅవుట్లతో, యువ వినియోగదారుల కోసమే ప్రత్యేకంగా సరసమైన ధరలలో హై ఫ్యాషన్‌ను యూస్టా అందిస్తుంది. ఈ సందర్భంగా రిలయన్స్ రిటైల్ ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ప్రెసిడెంట్, సీఈఓ అఖిలేష్‌ప్రసాద్ మాట్లాడుతూ... యూస్టా ఒక యువ డైనమిక్ బ్రాండ్ అని పేర్కొన్నారు. ఇది ఈ దేశంలోని యువతతో పెరుగుతుందన్నారు. వారితో పాటే అభివృద్ధి కూడా చెందుతుందన్నారు. ఫ్యాషన్ అవసరాలను అర్థం చేసుకోవడానికి ఈ బృందం భారతదేశ యువతరంతో నిరంతరం పనిచేస్తుందన్నారు. రోజూ తాజాదనంపరంగా ఔచిత్యం పరంగా డేవస్‌గా ఉంటుందన్నారు. యూస్టా యువతకు వాయిస్ ఇవ్వడమే కాకుండా తమను తాము వ్యక్తీకరించుకునే స్వేచ్ఛను కూడా ఇస్తుందన్నారు. యూస్టా రేంజ్ అంతా ఇప్పుడు హైదరాబాద్ నగరంలో ఈ బ్రాండ్ యొక్క మొట్ట మొదటి స్టోర్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. అంతేకాక ఆన్‌లైన్‌లోనూ ఏజియో, జియోమార్ట్ ద్వారా కూడా పొందవచ్చన్నారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం

శంషాబాద్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అతడితో పాటు ఉండే మరో ఇద్దరు కూలీలు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని సామ ఎన్‌క్లేవ్‌లో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనంలో కింది ఫ్లోర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గదిలోంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జార్కండ్ నుంచి వచ్చి పనిచేస్తున్న పింటూ (35)గా గుర్తించారు. అతడితో పాటే అదే ప్రాంతానికి చెందిన కైలాష్, రాజు అనే మరో ఇద్దరు వ్యక్తులు ఉండే వారని వారు గత సోమవారం నుంచి కనిపించడం లేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. ముగ్గురు కూడా ఓ మేస్త్రీ వద్ద రోజు వారి కూలీలుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. పింటూను హత్య చేసి వారు పారిపోయారా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతుడి ఒంటిపై మాత్రం ఎలాంటి గాయాలు లేవు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఏఎస్ఐని ఢీకొట్టాడు

రాజేంద్రనగర్: విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏఎస్ఐను ద్విచక్ర వాహనాదారుడు ఢీకొనడంతో కాలికి గాయమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హసన్‌నగర్‌కు చెందిన నజీరుద్దీన్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. పీడీపీ చౌరస్తా వద్దకు రాగానే మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఏఎస్సై నజీరుద్దీన్ కిందపడడంతో గాయాలయ్యాయి. వాహనం నడిపిస్తున్న వ్యక్తికి సైతం గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఇరువురిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాదారుడు మద్యం మత్తులో ఉండడంతో పరిశీలించగా 300 రీడింగ్ నమోదొంది. ఏఎస్సై ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేను లేకపోతే నా విలువ తెలుస్తుంది

● వాట్సప్ స్టేటస్ పోస్ట్ చేసి యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: నేను లేకపోతే నా విలువ తెలుస్తుంది అంటూ ఓ యువకుడు తన సెల్‌ఫోన్ వాట్సప్‌లో స్టేటస్ పోస్ట్ చేసి ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన రాజేష్(26)కుక్. బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరు లేని సమయంలో హాల్‌లో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు రాజేష్ తన సెల్‌ఫోన్ వాట్సప్ స్టేటస్‌లోనేను లేకపోతే నా విలువ తెలుస్తుంది అంటూ స్టేటస్ పెట్టుకున్నాడు. బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంట్లోకి వచ్చి చూడగా ఉరి వేసుకోని కనిపించాడు. వెంటనే కిందకు దించి ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రాజేంద్రనగర్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన ముగ్గరికి జైలు శిక్ష విధించినట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.బోస్ కిరణ్ వెల్లడించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన మద్యం సేవించిన వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసిన తరువాత కూడా వాహనాలు నడిపిన మొత్తం 13 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని గురువారం 3వ స్పెషల్ ఎంఎం కోర్టులో మెజిస్ట్రేట్ నజీరుద్దీన్‌షా ముందు హాజరుపరిచామన్నారు. 13 మందిలో ముగ్గరికి జైలు శిక్ష విధించారన్నారు. ఇద్దరికి మూడు రోజుల చొప్పున, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మిగిలిన వారికి జరిమానా విధించారన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

మణికొండ: నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కిన ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్షను విధించింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన మేరకు.. మంగళవారం శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడపగా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో బయటపడింది. దాంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా గురువారం అతనికి రూ.2వేల జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను లక్ష మెజార్టీతో గెలిపించుకుంటాం



ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్‌లు అన్నారు. బీసీ బంధు లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కులను అందజేసిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. అనుముల జాన్‌పాల్, రగడంపల్లి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, యువ నాయకుడు టింకురెడ్డిలు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదర్షాకోట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ శిథిలావస్థకు చేరి కూలిపోయిందన్నారు. దీంతో రాత్రి సమయంలో పాఠశాలలోకి చేరి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా సర్కారు పనిచేస్తోంది



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర సర్కారు నిరంతరం పనిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని పదిహేడో వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన ఆయన ఎమ్మెల్యే నిధులతో చేపడుతున్న ముదిరాజ్ భవనంపై కప్పు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి సన్మానం



డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డిని పలువురు గురువారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ పట్నం మహేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పూల బోకే అందించి శాలువాతో సత్కరించారు. అలాగే బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

27న శాంతిసరోవర్‌లో రక్షాబంధన్ వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'రక్షాబంధన్' వేడకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు, మెడిటేషన్, రాఖీధారణ కార్యక్రమం,ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఫోన్: 040 2300 1234లో సంప్రదించాలని వారు కోరారు.

శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్‌గౌడ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్ గౌడ్ గురువారం బాధ్యతులు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ కమిషనరేట్ అటాచ్ అయ్యారు. ఆయన స్థానంలో ముషీరాబాద్ మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన లక్ష్మణ్ గౌడ్ శేరిలింగంపల్లికి బదిలీపై వచ్చారు. గతంలో సరూర్‌నగర్, సంగారెడ్డిలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

సంస్థల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం

జూమ్ ఇండియా సార్క్ జనరల్ మేనేజర్, హెడ్ సమీర్ రాజే

గచ్చిబౌలి: భారతదేశంలోని సంస్థలన్నింటినీ బలోపేతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని జూమ్ ఇండియా సార్క్ జనరల్ మేనేజ్, హెడ్ సమీర్ రాజే పేర్కొన్నారు. 'జూమ్' ఆధ్వర్యంలో జూమ్ అనుభవ దినోత్సవాన్ని గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధునాతన సాంకేతిక విధానాలు జూమ్ నిర్వహణలో రావడంతో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, వినియోగదారుల పని సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఎంతగానో జూమ్ ఉపయోగపడుతుందన్నారు. జూమ్ నిర్వహణతోనే టీమ్ చాట్, మీటింగ్స్, కాంటాక్ట్, స్మార్ట్ రికార్డింగ్ వంటి ప్రక్రియల ద్వారా ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉంటుందన్నారు. కంపెనీ ఆధునిక సామర్థ్యాలను దాని డైనమిక్, తెలివైన నిర్ణయాలను వెల్లడించడానికి జూమ్ నిర్వహణ తోడ్పడుతుందన్నారు. దీంతో కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచుకోగలవన్నారు. ఇటీవల వచ్చిన వర్క్ వివో జూమ్ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు సరికొత్త విధానాలను తీసుకొచ్చిందన్నారు. దీంతోనే ఉద్యోగులు సరికొత్త అనుభూతిని పొందుతారన్నారు. వినియోగదారులతో సంబంధాలను మెరుగుపర్చడంలో ఇవి తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో సొల్యూషన్ ఇంజనీరింగ్ ఇండియా మేనేజర్ మెహర్‌కుమార్ ఉల్లిపాలెమ్ ప్రసంగించారు.

PUBLIC NOTICE

(FOR PURCHASE OF PLOT N0.29 IN SURVEY NO. 340/4, ADMEASURING 200 SQ YARDS SITUATED AT APOLLO TOWN - PHASE I, NARSINGHI, GANDIPET (M), RR DIST)

General public is hereby informed that my client Smt. Sristhi Tripathi D/o. Sri Srikant Tripathi, R/o. MIG-93, Satyawan Puri Basti, Awas Vikas Colony, Basti, Uttar Pradesh -272001 is intending to purchase Plot No.29, Admeasuring 200 Sq Yards in Survey No. 340/4 situated at Apollo Town - Phase I, Narsinghi, Gandipet - Mandal from its lawful owner Sri GADDAM RAMAKRISHNA REDDY S/o. Late S. BHOOMA REDDY, R/o. Flat 77 Marigold L-T Infocity, Telecom Nagar, Near Urdu University, Gachibowli, Hyderabad, Telangana - 500032 and paid a considerable amount as earnest money.

If any person(s) or institution(s) having any objection/claim/rights over the said transaction may approach the undersigned within (15) days with all relevant papers/documents from date of this publication. No claim will be entertained thereafter and my client shall proceed for registration as if there are no third party claims/objections/ disputes in respect of the schedule property.

Sd/- S. MOHAMED RIAZ, B.A, LLB
Advocate
D.No. 6-3-354/19, Hindi Nagar Colony, Panjagutta, Hyd-82.Cell No: 8897349458